

భక్తజనసంద్రంగా మారిన అగ్నితీర్థం - (ఇన్‌సెట్‌లో) మెరీనాబీచ్ వద్ద సామూహికంగా పితృదేవతలకు తర్పణాలు సమర్పిస్తున్న భక్తులు

రాష్ట్ర వ్యాప్తంగా
ఆడి అమావాస్య పూజలు

● పుణ్యతీర్థాల్లో పితృదేవతలకు తర్పణాలు



సమయపురం మారియమ్మన్ ఆలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం తమిళమాసమైన ఆడి (ఆషాఢ) అమావాస్య సందర్భంగా పుణ్యతీర్థాల్లో ప్రజలు స్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలారు. రామనాథపురం జిల్లా రామేశ్వరంలో రామేశ్వరం అగ్నితీర్థం వద్ద వేల సంఖ్యలో భక్తులు పితృదేవతలకు తర్పణాలు విడిచారు. అనంతరం భక్తులంతా పర్వతవర్థినీ సమేత రామనాథ స్వామి దర్శనం చేసుకున్నారు. ఇదే విధంగా తిరువాయ్యారు కావేరి తీరం పుష్పమండపం వద్ద, పూంపుహార్‌లో కావేరి నది కడలిలో కలిసే సంగమం ఘాట్ వద్ద, కన్నియాకుమారిలోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పితృదేవతలకు తర్పణాలు వదిలారు. తిరుచ్చి సమీపం సమయపురం మారియమ్మన్ ఆలయం వద్ద, తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం, తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం వద్ద భక్తులు తర్పణాలు విడిచిపెట్టారు. తిరుచెందూరు ఆలయం వద్ద భక్తుల రద్దీ విపరీతంగా పెరగటంతో ప్రత్యేక దర్శనాలను రద్దు చేశారు. ఇదే విధంగా తిరువళ్లూరు వీరరాఘవ పెరుమాళ్ ఆలయం, నగరంలోని మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, ప్యారీస్ కందస్వామి ఆలయం, మింట్ వీధిలో ఉన్న ఏకాంబరేశ్వరాలయం, వడపళని మురుగన్ ఆలయ తీర్థకొలనుల వద్ద భక్తులు పితృదేవతలను స్మరించుకుంటూ తర్పణాలు విడిచారు. నగరంలోని మెరీనా బీచ్ వద్ద కూడా వందలాదిమంది భక్తులు పితృదేవతలకు తర్పణాలు విడిచిపెట్టారు. కొన్ని చోట్ల వేలాదిమంది భక్తులు ఒకే సమయంలో తర్పణాలు విడిచేందుకు తరలి రావటంతో పురోహితుల కొరత కూడా ఏర్పడింది.

స్టాలిన్‌కు ఆంజియోగ్రామ్

● ఆస్పత్రిలోనే మరో రెండు రోజులు



ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు గురువారం ఉదయం ఆస్పత్రిలో ఆంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. అందులో గుండె పనితీరుకు సంబంధించిన ఫలితాలు అన్నీ సవ్యంగా ఉన్నట్లు అపోలో యాజమాన్యం ప్రకటించింది. ఈ నెల 21న స్టాలిన్ వాకింగ్ చేస్తున్నప్పుడు స్వల్ప అస్వస్థతకు గురై అపోలో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఇక్కడ రెండు రోజులపాటు వైద్యనిపుణులు ఆయనకు పలు పరీక్షలు జరిపారు. వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్న స్టాలిన్ రెండు రోజులుగా ఆస్పత్రి నుంచే వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. పథకాల అమలుపై సమీక్షలు కూడా జరిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం సీనియర్ మంత్రి దురైమురుగన్ అపోలో ఆస్పత్రికి వెళ్లి స్టాలిన్ పరామర్శించి, ఆరోగ్యపరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వెలుపల దురైమురుగన్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ కులాసాగా ఉన్నారని, ఆంజియోగ్రామ్ పరీక్ష కూడా జరిగిందని, వాటి ఫలితాలు సంతృప్తికరంగానే ఉన్నాయని వైద్యనిపుణులు చెప్పారన్నారు. సీఎం స్టాలిన్‌ను ఎప్పుడు డిశ్చార్జ్ చేయాలనే విషయమై ఆస్పత్రి వైద్యులే నిర్ణయం తీసుకుంటారని, తనకు తెలిసినంతవరకు ఆయన రెండు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోగ్య పరిస్థితులు గురించి అపోలో యాజమాన్యం ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ వాకింగ్‌కు వెళుతుండగా తల తిరుగుతున్నట్లు అనిపించడంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారని, ఆయనకు మూడు రోజులుగా అన్ని రకాల వైద్యపరీక్షలు జరిపామని అపోలో వైద్యసేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ అనిల్ పేర్కొన్నారు. ఆస్పత్రిలోని హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణుడు డాక్టర్ జి.సెంగొట్టువేలు నాయకత్వంలోని వైద్యనిపుణుల కమిటీ సలహా మేరకు గురువారం ఉదయం ఆంజియోగ్రామ్ పరీక్షలు జరిపినట్లు తెలిపారు. వాటి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి స్టాలిన్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, రెండు రోజుల తర్వాత ఆయన యథావిధిగా తన విధులను చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

సీఎం త్వరగా కోలుకోవాలి: టీవీకే నేత విజయ్

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ త్వరగా కోలుకోవాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... 'తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ త్వరగా కోలుకుని తన విధులు తిరిగి ప్రారంభించాలి' అంటూ ఆయన పోస్ట్ చేశారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్.ఎన్.రవిని గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఇండోనేషియా రాయబారి ఐనా హెచ్.కృష్ణమూర్తి

హస్తిన వెళ్లిన కమల్

● నేడు రాజ్యసభ ఎంపీగా ప్రమాణం

అడయార్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 'మక్కల్ నీది మయ్యం' (ఎంఎన్ఎం) అధ్యక్షుడు, అగ్ర నటుడు కమల్ హాసన్ గురువారం హస్తినకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రాజ్యసభ ఎంపీగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్యసభకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రం నుంచి డీఎంకే కూటమి తరపున కమల్ హాసన్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెల్సిందే. దీంతో ఆయన రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఢిల్లీకి వెళ్లారు. గురువారం ఉదయం 9 గంటలకు చెన్నై నుంచి బయలుదేరి ఢిల్లీ



చేరుకున్నారు. అంతకుముందు ఆయన చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. తన దగ్గర వార్తల కోసం మాత్రమే విలేకరులు రాలేదని, తనకు బెస్ట్ విషెస్ చెప్పేందుకు వచ్చినట్టుగా తాను భావిస్తున్నానని సరదాగా వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమిళనాడు రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో రాజ్యసభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఢిల్లీకి వెళ్తున్నానని, భారతీయుడిగా తనకు అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తానని కమల్ వెల్లడించారు. కొన్ని విషయాలపై ఇక్కడ మాట్లాడినట్టుగా అక్కడ మాట్లాడలేనని, అక్కడ మాట్లాడినట్టుగా ఇక్కడ మాట్లాడలేనని చెప్పారు. అలాగే, తన ఆరేళ్ళ రాజకీయ ప్రయాణాన్ని నిశితంగా గమనిస్తే, తాను ప్రయాణించే మార్గం ఏంటో అందరికీ అవగతమవుతుందని కమల్ వ్యాఖ్యానించారు.



సెకండరీ గ్రేడ్ టీచర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఉదయనిధి

చదువుతోపాటు ఆటలూ!

● బడిపిల్లలకు డిప్యూటీ సీఎం సూచన



కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడిపిల్లలు రోజంతా చదువుపైనే ధ్యాస పెడితే చాలదని, కొంత సమయాన్ని క్రీడలకు కూడా కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సూచించారు. గురువారం నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటైన సభలో ఉపాధ్యాయుల ఎంపిక సంస్థ ద్వారా ఎంపికైన అభ్యర్థులు 2,497 మందికి సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియామక ఉత్తర్వులను ఆయన అందజేశారు. టీఎన్ స్పార్క్ సాంకేతిక పరిజ్ఞానంపై ముద్రించిన పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో ఉదయనిధి మాట్లాడుతూ ఉపాధ్యాయులను చూస్తేనే తనకు భయం కలుగుతుందన్నారు. విద్యార్థి దశలో ఒకరిద్దరు టీచర్లను చూస్తే భయపడే తాను ఒకేసారి ఇన్నివేల మంది టీచర్లను చూస్తుంటే చాలా భయం వేస్తోందని, అంతేకాకుండా వారిపట్ల గౌరవభావం కూడా అధికమవుతుందని చెప్పారు. ప్రాథమిక పాఠశాలల్లో మహిళలను టీచర్లుగా నియమించాలని పెరియార్ తీర్మానం ప్రతిపాదించారని, కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యాకే నెరవేరిందన్నారు. భారతదేశంలోనే బడి మానేసే పిల్లలు లేని రాష్ట్రంగా తమిళనాడు గుర్తింపు పొందిందని, విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఈ సభలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్, మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యేలు ఇ.పరంధామన్, ఎ. వెట్రి అళగన్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ చైర్మన్ దిండుగల్ లియోని, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే
మత్స్యకారులకు ఇళ్లు

● గంధర్వకోట రోడ్‌షోలో ఈపీఎస్ హామీ

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే ఇళ్లులేని మత్స్యకారులకు కాంక్రీటు ఇళ్లను నిర్మించి ఇస్తానని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) హామీ ఇచ్చారు. గురువారం పట్టుకోట సమీపం గంధర్వకోటలో పర్యటన చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుకోట జిల్లాల్లో కొబ్బరి సాగు అధికంగా ఉందని, కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కొబ్బరి చెట్లకు తెగులు సోకుతున్నాయని రైతులు తన దృష్టికి తెచ్చారని, ఈ విషయాన్ని కొబ్బరి పరిశోధన సంస్థకు తెలిపి పరిష్కరింపజేస్తానని భరోసా ఇచ్చారు. అన్నాడీఎంకే అధికారంలో ఉన్నప్పుడు రెండు సార్లు రైతు రుణాలను మాఫీ చేశామని, డీఎంకే ప్రభుత్వం గత నాలుగేళ్లుగా రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మత్స్యకారుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని, అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్లులేని మత్స్యకారులకు కాంక్రీటు ఇళ్లను నిర్మించి ఇస్తామని ఈపీఎస్ హామీ ఇచ్చారు.




తిరుచ్చిలో మోదీతో భేటీ?

రెండు రోజులు పర్యటన నిమిత్తం రాష్ట్రానికి రానున్న ప్రధాని నరేంద్రమోదీని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తిరుచ్చిలో కలుసుకుంటారని అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి. ఈ నెల 26 రాత్రి మోదీ తిరుచ్చిలో బసచేయనున్నారు. ఆ సందర్భంగా అదే రోజు రాత్రిగానీ, మరుసటి రోజు ఉదయం గానీ ఈపీఎస్ ప్రధానిని కలుసుకునే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే ప్రధానితో భేటీ కోసం అపాయింట్‌మెంట్ కోరినట్లు చెప్పారు.

పార్టీ అధ్యక్షుడిని నేనే

● తైలాపురం గార్డెన్ నుంచే పార్టీ వ్యవహారాలు
● అన్బుమణి యాత్రకు వెళ్లొద్దు
● మరోమారు తనయుడిపై ధ్వజమెత్తిన రాందాస్



పీఎంకే చీఫ్ రాందాస్

ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధ్యక్షుడిని తానేనని, పార్టీ జెండా, తన పేరు ఎక్కడా ఉపయోగించరాదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ మరోమారు తన తనయుడు అన్బుమణికి హుకుం జారీ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కల్పించాలన్న డిమాండ్‌తో శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్బుమణి పాదయాత్ర చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ యాత్రకు అనుమతించవద్దని కోరుతూ రాందాస్ తరపున గురువారం డీజీపీ శంకర్ జివాల్‌కు ఆ పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాందాస్ మీడియాతో మాట్లాడుతూ... పార్టీ అజెండా ప్రకారం, అన్బుమణికి పార్టీలో ఎలాంటి నిర్ణయాలు తీసుకునే అధికారం లేదని, తన అనుమతి లేకుండా చేపట్టనున్న ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లరాదని దిశానిర్దేశం చేశారు. పాదయాత్రలో, ప్రచారంలో తన పేరు కూడా ఉచ్చరించరాదని తనయుడికి రాందాస్ తేల్చి చెప్పారు.

ఈలం కోసం ప్రాణాలిస్తా

● రాజ్యసభలో వైగో




ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక తమిళుల కోసం ప్రాణాలు అర్పించేందుకైనా సిద్ధమేనని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వైగో తన చివరి ప్రసంగంలో రాజ్యసభలో భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. డీఎంకే కూటమి తరపున రాజ్యసభకు ఎంపికైన వైగో పదవీకాలం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీడ్కోలు సభ జరిగింది. సభలో పాల్గొన్న వైగో తనకు రాజ్యసభ పదవి కల్పించిన డీఎంకే, పెద్దల సభలో ఉన్న వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీలంక తమిళులకు ఆ దేశంలో ఇప్పటికి స్వేచ్ఛ లభించలేదని, సింహళ పాలకుల చేతిలో చిత్రహింసలకు గురవుతున్నారని, ఈ అంశంపై తాను రాజ్యసభలో 13 సార్లు సావధాన తీర్మానం ప్రవేశపెట్టానని గుర్తుచేసుకున్నారు. లంక తమిళుల హక్కుల కోసం గళమెత్తిన తనను వరసగా 19 నెలలు పోటా చట్టం కింద హౌస్ అరెస్ట్ చేశారని, మిసా చట్టం కింద మరో 12 నెలలు జైలులో ఉంచారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై తాను 1978, 1984, 1990, 2019 సంవత్సరాల్లో రాజ్యసభలో మాట్లాడానని, వీటిలో సభ్యుల మద్దతుతో పలు సమస్యలకు పరిష్కారం కల్పించేలా కృషిచేసిన విషయాన్ని వైగో సభలో వివరించారు.

ప్రాథమిక పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

● మంత్రి అన్బిల్ మహేష్




పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 3.94 లక్షల మంది విద్యార్థులు చేరినట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. ఈ మేరకు మంత్రి తన ఎక్స్ పేజీలో.. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వ విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యా రంగానికి నిధులు పెంచడంతో పాటు విద్యార్థులు ఉపకార వేతనం, ఉచిత విద్యా సామగ్రి అందిస్తుందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు మార్చి 1వ తేది నుంచి ప్రారంభించగా, బుధవారం వరకు 3,94,016 మంది విద్యార్థులకు కొత్తగా చేరినట్లు సంతోషంగా చెబుతున్నట్లు మంత్రి అన్బిల్ మహేష్ పోస్ట్ చేశారు.



'కూలీ' నుంచి 'పవర్ హౌస్' లిరికల్ సాంగ్ రిలీజ్

గజగిరి క్షేత్రంలో వెలసిన యోగనారసింహుడు
● యానైమలై
విశేషాల ఆధ్యాత్మికం



- వివరాలు 7లో -

సమాచార దృష్టి

నేడు ప్లస్ టూ సప్లిమెంటరీ మార్కుల జాబితా

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సప్లిమెంటరీ పరీక్షలు రాసిన ప్లస్ టూ విద్యార్థులు శుక్రవారం నుంచి మార్కుల జాబితా పొందవచ్చు. విద్యార్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి మార్కుల జాబితా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జవాబు పత్రం నకలు పొందగోరు విద్యార్థులు ఈనెల 28,29 తేదీల్లో సంబంధిత జిల్లా విద్యా శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రభుత్వ పరీక్ష శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం-కంచి-బెంగళూరు మధ్య ఏసీ బస్సులు

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తాంబరం నుంచి కాంచీపురం మీదుగా బెంగళూరుకు మూడు ఏసీ బస్సులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ బస్సులో సెల్‌ఫోన్ చార్జింగ్ సదుపాయం, సీసీ కెమెరాలు, రానున్న బస్టాప్ వివరాలు లౌడ్‌స్పీకర్లలో తెలిపేలా ప్రత్యేక అంశాలున్నాయి. ప్రయాణికుల ఆదరణ బట్టి ఏసీ బస్సుల సంఖ్య పెంచుతామని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) అధికారులు తెలిపారు.

పినాకినీ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా ఏసీ చైర్‌కార్

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-విజయవాడ-చెన్నై సెంట్రల్ మధ్య నడిచే పినాకినీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 26 నుంచి అదనంగా ఒక ఏసీ చైర్ కార్ కోచ్ అనుసంధానం చేయనున్నారు. అలాగే, తిరుపతి-మన్నార్‌కుడి-తిరుపతి మధ్య నడిచే పామని ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి ఒక ఏసీ త్రీ టైర్, మూడు స్లీపర్ క్లాస్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

పోటీపరీక్షల సందేహాల నివృత్తికి ప్రత్యేక నెంబర్లు

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల సందేహాలు నివృత్తి చేసేలా ప్రత్యేక నెంబర్లను టీఎన్‌పీఎస్సీ పరిచయం చేసింది. పోటీ పరీక్షలకు దరఖాస్తు నమోదు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు అప్‌లోడ్ తదితర సందేహాలకు 044-25300336, 25300337, 338, 339, 340 నెంబర్లు సంప్రదించవచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

రైల్వేస్టేషన్లలో 'రీల్స్' చేస్తే రూ.1,000 జరిమానా

పెరంబూర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో 'రీల్స్' చేస్తే రూ.1,000 జరిమానా విధిస్తామని రైల్వే అధికారులు హెచ్చరించారు. మొబైల్ ఫోన్లలో వీడియోలు తీసి వాటిని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసి లైక్స్, కామెంట్స్ పొందే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కొత్తదనం చూపించేలా ప్రయాదకరమైన రీల్స్ చేస్తున్న వారు కూడా ఎక్కువవుతున్నారు. పలువురు పట్టాలపై అతివేగంగా వెళ్తున్న రైలు పక్కన, బోగీలపై ఎక్కి తదితర ప్రాణాపాయ స్థితిలో రీల్స్ చేస్తున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన రైల్వే అధికారులు, రైల్వేస్టేషన్లు, రైళ్ల పక్కన, పైన రీల్స్ చేస్తే రూ.1,000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

31న 'విన్‌ఫాస్ట్' కర్మాగారాన్ని ప్రారంభించనున్న సీఎం

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాల ఉత్పత్తి సంస్థ 'విన్‌ఫాస్ట్' కర్మాగారాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 31న ప్రారంభించనున్నట్లు ప్రకటన విడుదల చేశారు. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ సంస్థ విద్యుత్ వాహనాల తయారీ కర్మాగారాన్ని తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారం తాలూకా సిల్లానత్తం సిప్కాట్‌లో రూ.4,000 కోట్లతో ఏర్పాటుచేసింది. 2024 ఫిబ్రవరిలో సీఎం స్టాలిన్, ఈ కర్మాగార నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో ఈనెల 31న సీఎం కర్మాగారాన్ని ప్రారంభిస్తారని ప్రకటించారు. ఒకవేళ సీఎం స్వయంగా పాల్గొనని పక్షంలో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

పారంపర్య వైద్యకోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సిద్ధ, ఆయుర్వేద, యునాని, హోమియోపతి కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులు అందిస్తున్న ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 320 సీట్లుండగా, అఖిల భారత కోటాకు 48, మిగిలిన 272 సీట్లు రాష్ట్ర కోటాకు కేటాయించారు. ఇవే కాకుండా 29 ప్రైవేటు కళాశాలల్లో 1,920 సీట్లుండగా, 15 శాతం అఖిల భారత కోటా, 55 శాతం రాష్ట్ర కోటా, మిగిలినవి మేనేజ్‌మెంట్ కోటాకు కేటాయించారు. విద్యార్థులు ఆగస్టు 8వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలి. అలాగే, దరఖాస్తులు, సర్టిఫికెట్ నకళ్లతో అరుంబాక్కంలోని భారత వైద్య, హోమియోపతి శాఖ కార్యాలయంలో స్వయంగా సమర్పించవచ్చని అధికారులు తెలిపారు.

గృహిణుల సాధికారిక నగదు కోసం 4.5 లక్షల మంది దరఖాస్తు

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కలైంజర్ గృహిణుల సాధికారిక నగదు పథకం తమకు వర్తింపజేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 'ఉంగలుడన్ స్టాలిన్' పేరుతో ప్రజావిజ్ఞప్తుల స్వీకరణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆ శిబిరాల్లో వీరంతా కలైంజర్ గృహిణులు సాధికారిక నగదు పంపిణీ పథకాన్ని తమకు కూడా వర్తింపజేయాలని దరఖాస్తు సమర్పించారు. ఇతర సమస్యలకు సంబంధించి ఇప్పటివరకూ ప్రజల నుండి 9లక్షలకు పైగా వినతిపత్రాలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

నీలగిరిలో పర్యాటక ప్రాంతాల మూసివేత

అడయార్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నీలగిరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారు. గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. ఆ జిల్లాలోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా పర్యాటక ప్రాంతాలను మూసివేస్తూ రాష్ట్ర అటవీ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతాలను తిరిగి తెరిసే అంశంపై రెండు మూడు రోజుల్లో ప్రకటన చేస్తామని వెల్లడించింది.

గ్రాడ్యుయేట్ టీచర్లుగా బీఈ, బీఎడ్ పట్టభద్రులు

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీఈ, బీఎడ్ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ టీచర్లుగా పనిచేయడానికి ఉన్న నిషేధం ఎత్తివేశారు. యూజీ, ఇంజినీరింగ్, ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసిన వారికి పాఠశాలల్లో బోధనా ఉద్యోగాలు కల్పించడంలో సమస్య కొనసాగింది. 2024 డిసెంబరు 10న జరిగిన 'ఈక్విలెంట్ కమిటీ' సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. అనంతరం, ఆరు నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్ సబ్జెక్ట్ బోధించే గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు బీఈ, బీఎడ్ డిగ్రీ సమానమైన విద్యార్హతగా గుర్తిస్తూ తీర్మానించారు. ఆ ప్రకారం, బీఈ, బీఎడ్ పూర్తిచేసిన వారు గ్రాడ్యుయేట్ టీచర్లుగా పనిచేయవచ్చని ఉన్నత విద్యాశాఖ జీవో విడుదల చేసింది.

సరస్వతీ మహల్‌ను మోడల్ లైబ్రరీగా ప్రకటించాలని కేసు

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసు



ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సరస్వతి మహల్ లైబ్రరీని మోడల్ గ్రంథాలయంగా ప్రకటించాలని కోరుతూ మద్రాసు హైకోర్టు మదురై బెంచ్‌లో చెన్నైకి చెందిన ప్రభాకరన్ దాఖలుచేసిన ప్రజావ్యాజ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసు జారీ అయింది. ఈ లైబ్రరీలో తమిళం, సంస్కృతం, తెలుగు, ఉర్దూ తదితర 60 భాషల్లో సుమారు 60వేలకు పైగా రాతప్రతులు, 4,503 అరుదైన పుస్తకాలున్నాయి.. ఈ గ్రంథాలయ పర్యవేక్షణకు 46 మంది ఉద్యోగులు అవసరం కాగా, ప్రస్తుతం 14 మంది మాత్రమే పనిచేస్తున్నారు. చారిత్రాత్మకమైన ఈ గ్రంథాలయానికి 2014వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కానీ, ఈ నిధులు సక్రమంగా వినియోగించలేదని కోరుతూ ప్రభాకరన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, మరియ గ్లాడ్‌లతో కూడిన ధర్మాసనం... తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయం పురాతనమైనదని, అందువల్ల దీనికి ప్రాధాన్యత కల్పించాలని అభిప్రాయం వ్యక్తం చేస్తూ, పిటిషనర్‌కు సమాధానం చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

దళిత వీధుల మీదుగా రథం ఊరేగింపు

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరు జిల్లా వెప్పందకోట గ్రామంలో ఉన్న వేద మారియమ్మన్ ఆలయ వేడుకల సందర్భంగా, దళితులు నివసించే ప్రాంతాల్లో రథం ఊరేగింపు వెళ్లేలా జిల్లా యంత్రాంగం పర్యవేక్షించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. వెప్పంకోట గ్రామంలో వేదమారియమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయ రథం దళితులు నివసించే ప్రాంతంలోకి వెళ్లేందుకు మరో వర్గం వ్యతిరేకిస్తుందంటూ, అదే గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, మణివన్నన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, నిర్దిష్ట వీధుల్లో రథం వెళ్లేందుకు రోడ్డు సదుపాయం, రథం పొడవు, వెడల్పు తదితరాలు పరిశీలించి నివేదిక దాఖలుచేయాలని పెరంబలూరు జిల్లా న్యాయ పనుల కేంద్రానికి ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసు బుధవారం న్యాయమూర్తి వేల్‌మురుగన్ విచారించగా, జిల్లా న్యాయ సేవ పనుల కమిషన్ చైర్మన్ నివేదిక దాఖలుచేశారు. అందులో... నిర్దిష్ట వీధుల్లో రథం వెళ్లేందుకు ఎలాంటి ఆటంకం లేదని పేర్కొన్నారు. నివేదిక పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, ఆలయ ఉత్సవాల సమయంలో దళితులు నివసించే ప్రాంతాల మీదుగా రథం ఊరేగింపు నిర్వహించాలని, అందుకు అవసరమైన బందోబస్తును జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సమాచార ప్రతినిధుల నియామకానికి వ్యతిరేకంగా పిటిషన్

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సీనియర్ ఐఏఎస్ అధికారులు రాధాకృష్ణన్, గగన్‌దీప్‌సింగ్ బేదీ, ధీరజ్‌కుమార్, అముదలను సమాచార ప్రతినిధులుగా నియమిస్తూ ఈనెల 14న ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు. దానిని వ్యతిరేకిస్తూ నగరానికి చెందిన న్యాయవాది సత్యకుమార్ మద్రాసు హైకోర్టు ప్రజావ్యాజ్యం దాఖలుచేశారు. పిటిషన్‌లో... ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు లేకుండా, అధికారిక గెజిట్‌లో ప్రకటించకుండా, తగిన విధానాలు పాటించకుండా నలుగురు ఐఏఎస్ అధికారులను సమాచార ప్రతినిధులుగా నియమించడం చట్టబద్ధంగా చెల్లదని, కేవలం పత్రికా ప్రకటన మాత్రమే ఇచ్చారని, ఇది పరిపాలన ఉల్లంఘన అని పేర్కొన్నారు. ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేసి అధికార పార్టీకి అనుకూలమైన సమాచారం ప్రజలకు తెలియజేసే అవకాశముంది, కావున, ఈ నియామకానికి సంబంధించి ప్రచురించిన పత్రికా ప్రకటనను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానున్నట్లు సమాచారం.

పాత పింఛన్ కోసం రిలే నిరాహారదీక్ష



దీక్షలో పాల్గొన్న సభ్యులు

ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ చేపాక్కంలో సీపీఎస్ వ్యతిరేక ఉద్యమం ఆధ్వర్యంలో 72 గంటల రిలే నిరాహారదీక్ష బుధవారం ప్రారంభమైంది. ఇందులో 300 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు పాల్గొని నినాదాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పింఛన్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలుచేయాలి, గ్రాడ్యుటీ, కుటుంబ పింఛన్ తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ నిరాహారదీక్ష గురువారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ... 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే విడుదల చేసిన మేనిఫెస్టోలో, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి నాలుగేళ్లయినా డీఎంకే ప్రభుత్వం అమలుచేయలేదని, రాజస్థాన్, ఛత్తీస్‌ఘగ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోలాగే తమకు ప్రభుత్వం తరఫున అన్ని రాయితీలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరాహారదీక్ష వచ్చే శనివారం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

తిరుత్తణి ఆలయ హుండీ ఆదాయం రూ.1.71 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

తిరుత్తణి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి వారి ఆదాయం రూ.1.71 కోట్లు వచ్చినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రతి రోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. భక్తులు స్వామివారి దర్శనానంతరం హుండీల్లో కానుకలు వేస్తుంటారు. 23 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు ఆలయ జాయింట్ కమిషనర్ రమణి నేతృత్వంలో జరుగగా, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. హుండీల ద్వారా రూ.1,71,32,719 నగదు, 649 గ్రాముల బంగారం, 14,007 గ్రాముల వెండి, అమెరికా, దుబాయ్, సింగపూర్ తదితర దేశాల కరెన్సీ నోట్లు వచ్చాయి. వాటితో పాటు రద్దు చేసిన రూ.2,000, రూ.500 నోట్లు కూడా ఉన్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

మళ్లీ ఊపందుకున్న 'పరందూరు' వ్యతిరేకోద్యమం



వనతోట్టంలో ధర్నాకు దిగిన స్థానికులు

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పరందూరు వద్ద హరిత విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ వెయ్యిరోజులకు పైగా జరుగుతున్న ఆందోళన మరింత ఊపందుకుంది. విమానాశ్రయం వల్ల భూములు కోల్పోనున్న వనతోట్టం ప్రాంత ప్రజలు ధర్నా కు దిగారు. పరందూరు వద్ద రెండో విమానాశ్రయం నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ఇప్పటికే కొన్ని వందల ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ వనతోట్టమ్ ప్రాంతానికి చెందిన ప్రజలు కూడా ఆందోళనకు దిగారు.

టీ షాపు యజమానిపై దాడి

వృద్ధుడి అరెస్ట్

ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేటలో టీ దుకాణ యజమానిపై దాడిచేసిన 80 ఏళ్ల వృద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వాషర్‌మెన్‌పేట పోస్టాఫీసు సమీపంలో ముత్తయ్య కార్పొరేషన్ స్థలం ఆక్రమించి కొబ్బరి బోండాలు విక్రయ దుకాణం నడుపుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు దుకాణాన్ని తొలగించారు. తనపై ఫిర్యాదు చేసిందని టీ దుకాణ యజమాని రిషికేష్(50) అని ఆరోపిస్తూ గురువారం ఉదయం ముత్తయ్య అతనిపై కొబ్బరి బోండాలు నరికే కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రిషికేష్‌ను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, ముత్తయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం



వృద్ధురాలికి బీమా కార్డు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ బజార్ గాంధీ రోడ్డు సమీపంలోని వాసవి మహల్‌లో గురువారం 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కార్తికేయన్, 2వ మండల కమిటీ అధ్యక్షుడు నరేంద్రన్, కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, ప్రత్యేక సబ్ కలెక్టర్ సెంథిల్‌కుమార్, తహశీల్దార్ వడివేలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడిపై ఈడీ కేసు రద్దు

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడు రవిచంద్రన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదుచేసిన కేసు రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. 2013లో రవిచంద్రన్ ఐవోబీ నుంచి రూ.30 కోట్లు రుణం తీసుకున్న వ్యవహారంపె రవిచంద్రన్‌పై కేసు నమోదు చేశారు. ఈడీ నమోదుచేసిన కేసు రద్దు చేయాలని కోరుతూ రవిచంద్రన్ తరఫున పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ గతంలో విచారణకు రాగా, అన్ని విషయాల్లో జోక్యం చేసుకునేందుకు ఈడీ 'సూపర్ పోలీసు' కాదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కాగా, రవిచంద్రన్‌పై ఈడీ నమోదుచేసిన కేసు రద్దు చేస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది.

8,039 మంది ఉపాధ్యాయుల బదిలీ

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ఉన్నత, మహోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ బుధవారం ముగిసిన నేపథ్యంలో, 8,039మంది ఉపాధ్యాయులకు బదిలీ నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ పరిధిలోని 37,445 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 2.25లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతి ఏడాది జనరల్ కౌన్సెలింగ్ 'ఎమిస్' యాప్ ద్వారా నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, 2025-26 విద్యా సంవత్సరం బదిలీల కౌన్సెలింగ్ ఈనెల 1న ప్రారంభమై బుధవారంతో ముగిసింది. ఈ కౌన్సెలింగ్‌కు 50,416 మంది పేర్లు నమోదుచేసుకోగా, 8,039 మంది బదిలీ అయ్యారు. అలాగే, 20,911 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొనలేదు, మిగిలిన 21,466 మంది బదిలీకి అయిష్టత చూపినట్లు అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మిక స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



వేలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక స్నేహితుల సంఘం ఆధ్వర్యం లో ఈ నెల 22 నుంచి 24వ తేది వరకు ఆడి అమావాస్య సందర్భంగా సాధుకార మఠంలో అన్నదానం నిర్వహించారు. గురువారం ఆడి అమావాస్య సందర్భంగా అన్నదానం చేశారు. మూడు రోజులు ప్రతి రోజు 500 మందికి అన్నదానం చేసినట్లు సంఘ అధ్యక్షుడు, న్యాయవాది మురుగవేల్ తెలిపారు.

హిందూ మున్నని యువజన విభాగం సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆర్గనైజర్ షణ్ముగం

వేలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా హిందూ మున్నని యువజన విభాగం సమావేశంలో గురువారం జరిగింది. కాట్పాడి-చిత్తూర్ బస్టాండ్ సమీపంలోని కర్పగ వినాయక ఆలయంలో జరిగిన సమావేశానికి యువజన విభాగం రాష్ట్ర ఆర్గనైజర్ వి.షణ్ముగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో కోట ఆర్గనైజర్ రాజేష్, సెక్రటరీలు రవి, ప్రవీణ్‌కుమార్, జిల్లా సెక్రటరీ లోకేశ్వరన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **తాంబరం:** మాదంబాక్కం మెయిన్ రోడ్డు, రాజాంబాళ్ నగర్, నార్త్ మాదా రోడ్డు, వెస్ట్ మాదా రోడ్డు, మారుతి నగర్, పెరియార్ నగర్, చంద్రబోస్ నగర్, మురళి నగర్, చంద్రప్రభు నగర్, పెరియపాళయమ్మాళ్ ఆలయ వీధి. **ఎగ్మూర్:** సైడామ్స్ రోడ్డు కొంత భాగం, డిపో వీధి, పీటీ ముదాలి వీధి, సామిపిళ్లై వీధి కొంత భాగం, ఏపీ రోడ్డు, హంటర్స్ లైన్, జనరల్ కాలిన్స్ రోడ్డు, మాడెక్స్ వీధి, వీవీ ఆలయ వీధి, కురవన్ కుళం, సుబ్బహ నాయుడు వీధి, నెహ్రూ ఔట్‌డోర్ మరియు ఇండోర్ స్టేడియం, అప్పారావు గార్డన్, పెరియ తంబి వీధి, అండియప్పన్ వీధి, ఆనందకృష్ణన్ వీధి, పీకే ముదాలి వీధి, చూలై ఏరియా, కేపీ పార్క్ ఏరియా, పెరంబూర్ బారక్స్ రోడ్డు, రోట్లర్ వీధి, కలాదియప్ప వీధి, విర్పుముత్తయ్య వీధి, డాలి వీధి, మాణిక్యం వీధి, రంగయ్య వీధి కొంత భాగం, అష్టభుజ రోడ్డు కొంత భాగం, రాఘవ వీధి కొంత భాగం. **షోలింగనల్లూర్ డివిజన్:** చిట్లపాక్కం, వరదరాజపెరుమాళ్ ఆలయ వీధి, ఏడీపీ అవెన్యూ, వేంగైవాసల్ రోడ్డు, బీఎస్‌ఎన్‌పీఎల్, టీఎన్‌హెచ్‌బీ కాలని, వెంబా అవెన్యూ, కన్నికోయిల్ వీధి, ఎంజీఆర్ నగర్, పాశిల్ అవెన్యూ, నూక్కంపాళయం రోడ్డు, వివేకానంద నగర్, జయ నగర్, వళ్లువర్ నగర్, గాంధీ నగర్, అరసంకాలని మెయిన్ రోడ్డు, కారనై మెయిన్ రోడ్డు, శంకరాపురం, నాగలక్ష్మి నగర్, ఒట్టియంబాక్కం విలేజ్, నూక్కంపాళయం రోడ్డు, మల్లీస్ అపార్ట్‌మెంట్, కేజీ ఫ్లాట్స్, ఆర్సీ అపార్ట్‌మెంట్, నేశమణి నగర్, కైలాష్ నగర్, వరదాపురం, చెట్టినాడు విలాస్, సౌమ్య నగర్

అలమది: కీల్‌కొండయూర్, అరంపాక్కం విలేజ్, కర్లపాక్కం విలేజ్, తామరైపాక్కం విలేజ్, కాతతూర్ విలేజ్, వేళచ్చేరి విలేజ్, పొండేశ్వరం విలేజ్, కారనై విలేజ్, పుదుకుప్పం విలేజ్, వానియన్‌సత్రం, అరిలాచ్చేరి విలేజ్, గురువాయిల్ విలేజ్, పూచియత్తిపేడు, కొడువల్లి విలేజ్, రెడ్ హిల్స్ రోడ్డు, పాల్‌పన్నై రోడ్డు, వెల్‌టెక్ రోడ్డు, కొల్లుమేడు రోడ్డు.

మెదడు నిర్జీవమైన యువకుడి అవయవదానం



సతీష్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన యువకుడు, తన అవయవ దానంతో మరికొందరికి పునర్జన్మ ప్రసాదించాడు. బెంగళూరుకు చెందిన సతీష్ (23) స్థానిక సీఎంసీ ఆస్పత్రిలో మెషీన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22వ తేది ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వాలాజా టోల్ గేట్ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను సీఎంసీ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి 9.27 గంటలకు అతడి మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనలతో సతీష్ అవయవాలు దానంగా అందించేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో, ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా పొందిన అవయవాలను పలు ఆసుపత్రులకు తరలించి, అక్కడ అవసరమైన వారికి పొందుపరచనున్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడు సతీష్‌కు తల్లిదండ్రులు, అక్క, చెల్లెలు ఉన్నారు.

పాదయాత్ర బృందంపైకి దూసుకెళ్లిన వాహనం

● ఇద్దరు మహిళల మృతి



మృతి చెందిన శాంతి, భువనేశ్వరి

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరుప్పాలైకుడి వద్ద గురువారం వేకువజామున పాదయాత్రగా వెళ్తున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా, మరో ఐదుగురు మహిళలు గాయపడ్డారు. రామనాథపురం ఎంఎస్కే నగర్ ప్రాంతానికి చెందిన 18 మంది మహిళల బృందం వల్మీకనాథర్ సమేత బాగమ్‌ప్రియాల్ అమ్మన్ ఆలయానికి బయలుదేరారు. వేకువజాము 4.30 గంటలకు తిరుప్పాలకుడి, ఉప్పూరు మధ్య ఈస్ట్ కోస్ట్ రోడ్డులో నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శాంతి (50), భువనేశ్వరి (40) అనే ఇద్దరు మహిళలు మృతి చెందారు. ప్రమాదానికి గురైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నాగజోతి సహా మరో ఐదుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టేబుల్ ఫ్యాన్ స్విచ్ వేయబోయిన విద్యార్థిని విద్యుదాఘాతంతో మృతిచెందగా, ఆమె సోదరికి గాయాలయ్యాయి. రామనాథపురం జిల్లా మునియన్‌వలస గ్రామానికి చెందిన వర్షన ప్లస్ వన్ చదువుతోంది. గురువారం ఆమె ఉదయం టేబుల్ ఫ్యాన్ వేసేందుకు స్విచ్ నొక్కడంతో హఠాత్తుగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన సోదరి రక్షతియ ఆమెను పట్టుకోగా ఆమె కూడా షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే వర్షన మృతిచెందిందని నిర్ధారించిన వైద్యులు, రక్షతియకు చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మదురైలో రూ.3.75 కోట్ల హవాలా కరెన్సీ స్వాధీనం

● ఐదుగురి అరెస్ట్

ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఓ ముఠా కారులో చట్టవిరుద్ధంగా తరలించిన రూ.3.75 కోట్ల హవాలా కరెన్సీని పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేశారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ పార్కింగ్ ప్రదేశంలో హవాలా నగదును ఓ ముఠా కారులో ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి కారులోని బ్యాగుల్లో ఉన్న కరెన్సీ నోట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో హవాలా నగదుగా భావిస్తున్న పోలీసులు, ముఠా నాయకుడు బాబూరావు సహా ఐదుగురిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. అలాగే, నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో బెయిలు

● కళ్లకుర్చి జిల్లా జడ్జికి నోటీసు

ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ముద్దాయిలకు బెయిలు మంజూరు చేసిన కళ్లకుర్చి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నేరుగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. విల్లుపురం జిల్లాకు చెందిన లక్ష్మీబాలా, శంకరాపురం పోలీస్‌స్టేషన్‌లో తన భూమి కబ్జా చేయాలన్న ఉద్దేశంతో తన ఇంట్లో చొరబడి తనను, తన కుమార్తెపై దాడిచేసిన పంచాయతీ చైర్మన్ అరివళగి, ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అయితే, ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ, ఈ కేసు విచారణను మరో న్యాయస్థానానికి బదిలీ చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో లక్ష్మీబాలా పిటిషన్ దాఖలుచేశారు. న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందు గురువారం ఉదయం ఈ పిటిషన్ విచారణకు రాగా, పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది కాశిరాజన్... కేసులోని ముద్దాయిలకు బెయిలు మంజూరు చేయడంపై విచారణ జరపాలని అభ్యర్థించారు. ఇరుతరఫు వాదనల అనంతరం... కేసు విచారణ స్థాయిలో ఉండగా న్యాయమూర్తి ఈ కేసుకు సంబంధించిన ముద్దాయిలకు బెయిలు మంజూరు చేయడంపె 28వ తేది తగిన పత్రాలతో హాజరు కావాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ఉద్యోగం పేరుతో రూ.86 లక్షల మోసం

● ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం పేరుతో రూ.86.40 లక్షల మేర మోసం చేసిన ఇద్దరు మహిళల సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు మైలాడుదురై జిల్లా తారామంగళం తాలూకా తలసంగాడు నెహ్రూ నగర్‌కు చెందిన సురేష్ అనే వ్యక్తి భార్య అనిత సహా మొత్తం 27 మందికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని జిల్లాలోని చెంబనార్ కోయిల్‌కు చెందిన గిరిజ (33), మోహన్ అనే వ్యక్తి భార్య కల్పన (50), తిరుపూరు జిల్లా తిరుమురుగన్ పూండి రమేష్ (44) అనే వారు నమ్మించి రూ.86.40 లక్షల మేరకు వసూలు చేశారు. వీరికి కొన్ని రోజుల తర్వాత నకిలీ నియామక పత్రాలను అందజేశారు. ఈ విషయాన్ని గుర్తించిన బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశం మేరకు క్రైమ్ బ్రాంచ్ పోలీసులు లోతుగా విచారణ జరుపగా అసలు విషయం బయటపడింది. దీంతో మోసం చేసిన ఇద్దరు మహిళల సహా ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరిచి, కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని మందలింపు

● విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని తల్లి మందలించడంతో, 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తేని జిల్లాలో చోటుచేసుకుంది. కామయ్యగౌండన్‌పట్టి కరుమారిపురానికి చెందిన సంగిలి-ఈశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో కుమార్తె మధుమిత (14) ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. పాఠశాల నుంచి ఇంటికి వచ్చే మధుమతి సెల్‌ఫోన్‌లోనే గడపడం తల్లిదండ్రులు గమనించారు. బుధవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన మధుమతి, సెల్‌ఫోన్‌లో ఉండడాన్ని గమనించిన తల్లి ఆమెను మందలించి సెల్‌ఫోన్ తీసుకున్నట్లు సమాచారం. దీంతో, మధుమతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నా యూనివర్సిటీలో విద్యార్థి...

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి ప్రాంతంలోని అన్నా విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఆ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని అళగప్పా కళాశాలలో లెదర్ టెక్నాలజీ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థి శబరీశ్వరన్ (18) హాస్టల్‌గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఆ విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

500 థియేటర్లలో 'కెప్టెన్ ప్రభాకరన్' రీ-రిలీజ్

దివంగత సినీ నటుడు కెప్టెన్ విజయకాంత్ జయంతిని పురస్కరించుకుని ఆయన నటించిన చిత్రాల్లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'కెప్టెన్ ప్రభాకరన్' చిత్రాన్ని వచ్చే నెల 22న 500కుపైగా థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. ఈ విషయాన్ని గురువారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ చిత్ర దర్శకుడు ఆర్‌కే సెల్వమణి, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, డీఎండీకే కోశాధికారి సుదీశ్ సంయుక్తంగా వెల్లడించారు. ఇదే విషయంపై వారు మాట్లాడుతూ, 'విజయకాంత్ నటించి వందో చిత్రమైన 'కెప్టెన్ ప్రభాకరన్' బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు సాధించడంతో పాటు బ్లాక్‌బస్టర్ హిట్ మూవీగా నిలిచింది. 1991, ఏప్రిల్ 14న తమిళ నూతన సంవత్సరాది సందర్భంగా విడుదల చేయగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. ఈ చిత్రం తర్వాతే విజయకాంత్ పేరుకు ముందు 'కెప్టెన్' అనే పేరు చేరింది. అలాగే, ఈ సినిమా విడుదలై 34 యేళ్ళు పూర్తయిన నేపథ్యంలో ఆయన బర్త్‌డే (ఆగస్టు 25) సందర్భంగా, అత్యాధునిక 4కే టెక్నాలజీతో ఆగస్టు 22న విడుదల చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 500కుపైగా థియేటర్లలో స్పారో సినిమాస్ తరఫున కార్తీక్ వెంకటేశన్ విడుదల చేయనున్నారు' అని వివరించారు.



'కెప్టెన్ ప్రభాకరన్' మూవీ పోస్టర్

'పరాశక్తి'లో దగ్గుబాటి రానా?



శివకార్తికేయన్ హీరోగా, దర్శకురాలు సుధా కొంగర కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న 'పరాశక్తి' చిత్రంలో ప్రముఖ తెలుగు హీరో దగ్గుబాటి రానా నటిస్తున్నట్టుగా తాజా సమాచారం. ఈ విషయాన్ని మూవీ యూనిట్ అధికారికంగా ధ్రువీకరించకపోయినప్పటికీ, ఈ సినిమా లొకేషన్‌లో తీసిన ఓ వీడియో స్పష్టం చేస్తోంది. ఇందులో కొందరు అభిమానులకు దగ్గుబాటి రానా ఆటోగ్రాఫ్ ఇస్తున్నట్టుగా కనిపిస్తున్నారు. దీంతో ఈ మూవీలో రానా నటిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలావుంటే, కోలీవుడ్ హీరో రవి మోహన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో ముఖ్య పాత్రలో హీరో అధర్వ మురళి కనిపించనున్నారు.

చిత్రజ్యోతి



'కూలీ'లో రజనీకాంత్

'కూలీ' నుంచి 'పవర్ హౌస్' లిరికల్ సాంగ్ రిలీజ్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ' నుంచి 'పవర్ హౌస్' అంటూ సాగే లిరికల్ సాంగ్ తాజాగా రిలీజ్ చేశారు. వచ్చే నెల 14వ తేదీ విడుదలకానున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుని తుదిదశ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ మూవీ ప్రచారం కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే 'చికిటు', 'మోనికా' అనే రెండు లిరికల్ సాంగ్స్ రిలీజ్ చేయగా, ఈ పాటలకు అభిమానుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా మూడో సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సాహిత్యాన్ని అరివు అందించడంతో పాటు సంగీత దర్శకుడు అనిరుద్‌తో కలిసి నేపథ్యగానం చేశారు. పాన్ ఇండియా మూవీగా రూపొందుతోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, అక్కినేని నాగార్జున, శ్రుతిహాసన్, ఉపేంద్ర, ఆమీర్ ఖాన్ వంటి ప్రధాన తారాగణం నటించారు.

'ఐ యామ్ కమ్ బ్యాక్' అంటున్న శ్రుతి హాసన్



అగ్ర నటుడు కమల్ హాసన్ కుమార్తె, హీరోయిన్ శ్రుతి హాసన్ 'ఐ యామ్ కమ్ బ్యాక్' అంటున్నారు. గత కొన్ని రోజులుగా ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు దూరంగా ఉన్నారు. ఇపుడు మళ్ళీ ఇన్‌స్టాలో యాక్టివ్ అయినట్టుగా ఆమె వెల్లడిస్తూ... "ఐ యామ్ కమ్ బ్యాక్' అంటూ పోస్ట్ చేశారు. ఇతర నటీనటులతో పోల్చితే శ్రుతి హాసన్ తన ఇన్‌స్టాఖాతాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకునే అంశాలతో పాటు, తన సినిమా ప్రాజెక్టులకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికపుడు వెల్లడిస్తుంటారు. ఈ నేపథ్యంలో జూన్ నెలలో ఆమె ఇన్‌స్టా ఖాతా హ్యాక్ అయింది. ఈ విషయాన్ని ఆమె తెలియజేస్తూ, గత కొన్ని రోజులుగా ఎలాంటి పోస్టులు చేయలేదు. ఈ నేపథ్యంలో ఆమె ఇన్‌స్టా ఖాతా మళ్ళీ యాక్టివ్ అయింది. ఈ విషయాన్ని ఆమె వెల్లడిస్తూ ఐ యామ్ కమ్ బ్యాక్ అంటూ పోస్ట్ చేశారు.

భక్తుల కోర్కెలను నెరవేర్చే అనుగ్రహమూర్తిగా, లక్ష్మీసమేతుడై సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తున్నారు 'యానైమలై'లోని యోగనరసింహస్వామి. సహజసిద్ధంగానే ఏనుగు రూపంలో ఉన్న యానైమలై ఆలయాన్ని, పాండ్యరాజులు, చోళరాజులు, నాయకర్లు జీర్ణోద్ధరణ పనులు చేపట్టి మరింత సొబగులతో తీర్చిదిద్దారు. గుహాలయాలు కలిగిన పర్వతమే కాదు పెరుమాళ్ గజేంద్రమోక్ష ఘట్టాన్ని ప్రదర్శించే వైష్ణవ క్షేత్రంగాను భాసిల్లుతోంది. వీటన్నింటికి తోడు జైన, శైవ, వైష్ణవమతస్థుల ఆరాధన క్షేత్రంగా కీర్తిగడించింది ఈ గజగిరి క్షేత్రం. ఇన్ని విశేషాలు కలిగిన విశిష్టాలయమే యానైమలై యోగనరసింహస్వామివారి ఆలయం.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



పద్మతీర్థం వద్ద గజేంద్రమోక్షం ఘట్టాన్ని ప్రదర్శించే స్థలం


యానైమలై యోగనృసింహస్వామి


నరసింగవళ్ళి తాయార్


ఆలయ ముఖమండపం

ఆలయ వైభవం...

అతిపెద్ద ప్రహరీలు కలిగిన ఆలయంలో యోగనారసింహస్వామి వారి సన్నిధి, నరసింగవళ్ళి తాయార్ సన్నిధి ఉన్నాయి. అమ్మవారి సన్నిధి తర్వాత అయ్యవారి సన్నిధి దర్శనమిస్తుంది. అక్కడే గరుడ మండపం, యోగనృసింహస్వామి సన్నిధి వద్ద సింహాలు మోస్తున్నట్టు స్తంభాలు, వాటిని దాటుకుని వెళితే గుహాలయంలో యోగనారసింహుడు దర్శనమిస్తారు. పర్వత గుహాలయం కనుక ఈ ఆలయంలో ధ్వజస్తంభం ఉండదు. గర్భాలయం వెలుపల ఉత్తరదిశగా గణపతి ఆలయం, తరువాత అతిపెద్ద తీర్థకొలను ఉన్నాయి. ఇక్కడే తిరుమోగూర్ కాళమేగ పెరుమాళ్ కళ్లలగర్ వేషధారిగా వచ్చి గజేంద్రుడికి మోక్షాన్ని ప్రసాదించే ఘటాన్ని ప్రదర్శిస్తారు. ఈ వేడుకలను వీక్షించడానికి భక్తులు తండోపతండాలు వస్తారు. నరసింహ జయంతి, ప్రతి నెలా స్వాతి నక్షత్ర దినాలలో ప్రత్యేక ఆరాధనలు, అభిషేకాలు జరుగుతాయి.

భక్తుల కోర్కెలు తీర్చే అనుగ్రహ మూర్తి

యానైమలైలో వెలసిన లక్ష్మీపతి

- గజగిరి క్షేత్రంలో వెలసిన యోగనారసింహుడు
- జైన, శైవ, వైష్ణవుల ఆరాధన క్షేత్రం

ఎలా వెళ్ళాలి?...


రాజధాని నగరం చెన్నై నుండి మదురైకి విమానాలు, రైళ్ళు, బస్సులున్నాయి. మదురైలో దిగి, టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీల్లో మేలూరు మార్గంలో 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న యానైమలై క్షేత్రానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

తమిళంలో యానైమలైగా పేరుగాంచిన ఈ కొండపై జైన, శైవ, వైష్ణవాలయాలున్నాయి. ప్రధానమైనది యోగనారసింహస్వామి ఆలయం. ఈ గుహాలయానికి సమీపంలోనే వళ్ళి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి గుహాలయం ఉంది. పర్వతశిఖరాగ్రంపై జైన గుహలున్నాయి. యానైమలై ఉత్తరదిశలో వేదనారాయణ పెరుమాళ్ ఆలయం కూడా ఉంది. ఒకటో శతాబ్దం నుండి నాయకరాజుల కాలం వరకు ఆనాటి తమిళ రాజులు, చక్రవర్తులు ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులను క్రమం తప్పకుండా నిర్వహించేవారు. కనుక ఈ ఆలయంలో ప్రాచీన శిల్పకళా చాతుర్యం నేటికి ఉట్టిపడేలా ఉంది. ప్రాచీన కాలపు తమిళ భక్తి కీర్తనలు, గేయాలు, తమిళఅక్షరాలు ఈ పర్వతంపైనే చెక్కబడి ఉన్నాయి. ఈ ప్రాంతంలో జైన మతస్థులు అధికంగా నివసించారని తమిళ శైవభక్త శిఖామణి తిరుజ్ఞానసంబంధర్ తన 'దేవార పదిక్కముల'లో పేర్కొన్నారు. మొదటి వరగుణ పాండ్య చక్రవరి మంత్రివర్గ సభ్యుడైన మారన్‌కారి, అతడి తమ్ముడు మారన్‌ఎళినన్ ఈ గుహాలయాన్ని, ముఖమండపాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. మదురై నుండి ఈ క్షేత్రానికి వెళుతున్నప్పుడు ఈ పర్వతం ఓపట్టపుటేనుగు తొండాన్ని పైకెత్తి ఆహ్వానిస్తున్నట్లుగా దర్శనమిస్తుంది. ఈ కారణంగా ఈ క్షేత్రానికి 'యానైమలై (గజగిరి క్షేత్రం)గా పేరొచ్చింది.


పర్వతంపై రావి వృక్షం దిగువనున్న వినాయక ఆలయం


స్థలపురాణం..

రోమహర్షణ మునీశ్వరుడు సంతానం కోసం ఈ క్షేత్రం వద్ద ఉన్న సరస్సులో తపమాచరించారు. ఆ మునీశ్వరుడి తపస్సు మెచ్చిన ఉగ్రనరసింహస్వామి ప్రత్యక్షమయ్యాడు. దీంతో ఆ ప్రాంతమంతా భరించలేని వేడి ఆవహించింది. ఉగ్రనరసింహస్వామి ఆగ్రహాన్ని చూడలేక మునీశ్వరుడు వెంటనే వెళ్ళి స్వామివారి భక్తుడైన ప్రహ్లాదుని తీసుకొచ్చాడు. ప్రహ్లాదుడు కీర్తనలు పాడి స్వామివారి ఉగ్రరూపాన్ని తగ్గించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు లక్ష్మీదేవి వేంచేసి ఉగ్రనారసింహుడిని ప్రశాంతచిత్తుడిగా మార్చారు. అప్పటి నుండి ఉగ్రనరసింహస్వామి కాస్తా యోగనృసింహస్వామిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. బ్రహ్మదేవుడి ఐదో శిరస్సు ఖండించడం వల్ల తనకు కలిగిన బ్రహ్మహత్యా దోషం నుండి బయటపడేందుకు పరమేశ్వరుడు ఈ క్షేత్రంలో యోగనారసింహస్వామివారిని దర్శించినట్లు స్థలపురాణంలో పేర్కొన్నారు.


ఆలయ ప్రవేశద్వారం

ఆలయ ఆవిర్భావ కథనం...

ఈ గజగిరి గురించి ఆసక్తికరమైన కథ జనబాహుళ్యంలో ఉంది. పూర్వం అత్యంత పరాక్రమవంతుడైన ఓ పాండ్యరాజును యుద్ధంలో ఓడించలేని చోళరాజు జైనుల సహాయం కోరాడు. జైనుల సలహా ప్రకారం చోళరాజు అశోక వృక్షాల దిగువ యాగం చేసి ముల్లోకాలను భయపెట్టే లా అతి పెద్ద ఏనుగును రూపొందించిన దానిని మదురై నగరం వైపు బాణంలా ప్రయోగించారు. ఈ విషయాన్ని వేగుల ద్వారా తెలుసుకున్న పాండ్యరాజు తనను రక్షించమంటూ మదురైలోని మీనాక్షి, సుందరేశ్వరులను వేడుకున్నాడు. ఫలితంగా మదురై శివారులో అప్పటికప్పుడు ఓ మండపం ఏర్పడింది. ఆ మంటపం వద్ద పరమేశ్వరుడు సేవకుడి అవతారం దాల్చి, జైనులు ప్రయోగించిన ఆ పెద్ద ఏనుగునుపై దాడి జరిపారు. పరమేశ్వరుడి ధాటికి ఆ ఏనుగు నేలపై పడి పర్వతరూపం దాల్చింది. ఆ పర్వతమే నేడు యానైమలైగా పేరుగాంచింది. ఆ పర్వతంలోనే యోగనరసింహస్వామి ఆవిర్భవించటంతో అందమైన గుహాలయం ఏర్పడిందని 'పెరుంపత్రపులియూరు తిరువిళైయాడల్ పురాణం' చెబుతోంది. ఇక పరంజోతి మునీశ్వరుడి తిరువిళైయాడల్ పురాణం ద్వారా ఈ ఆలయం వద్ద పాండ్యరాజు తనయుడు తీర్థకొలను నిర్మించినట్లు పేర్కొంటోంది. ఆ తీర్థకొలను ప్రస్తుతం పద్మతీర్థంగా పేరుగాంచింది.


వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

ఆలయంలోని శిలాశాసనాలు

ఈ ఆలయం వద్ద లభించిన తొమ్మిది శిలాశాసనాలు ఆలయ జీర్ణోద్ధరణ చేసిన రాజుల వివరాలను తెలియజేస్తున్నాయి. మొదటి వరగుణ పాండ్యన్ (క్రీ.శ. 765), మొదటి మధురాంతక చోళుడు (క్రీ.శ. 907), జడైవర్మ సుందరపాండ్యన్ (క్రీ.శ. 1021), జడైవర్మ వల్లభపాండ్యన్ (క్రీ.శ. 1101), మొదటి మారవర్మన్ సుందర పాండ్యన్ (క్రీ.శ. 1216), శ్రీకృష్ణదేవరాయలు (క్రీ.శ. 1509) ఈ ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టి, ఆలయానికి భూములు, స్వర్ణాభరణాలను కానుకలుగా సమర్పించినట్లు శిలాశాసనాలు సాక్ష్యమిస్తున్నాయి.


నరసింగవళ్ళి తాయార్ సన్నిధి


పద్మతీర్థం

ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల తనిఖీ


కోచ్‌లను తనిఖీ చేస్తున్న నార్తరన్ రైల్వే జీఎం అశోక్ కుమార్ వర్మ తదితరులు

అడయార్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులో రైలు బోగీల తయారీ కర్మాగారాన్ని (ఐసీఎఫ్) ఈశాన్య రైల్వే (నార్తర్న్ రైల్వే) జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వందే భారత్ రైలు కోసం తయారు చేసిన ఎల్‌బీహెచ్ బోగీలతో పాటు హైడ్రోజన్ ట్రైన్ తనిఖీ చేశారు. ఆ తర్వాత ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావుతో సమావేశమై ఐసీఎఫ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు రైల్వే ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

అమర్ సేవా సంఘానికి చెన్నై పోర్టు భారీ విరాళం



చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా అయికుడిలో వున్న 'అమర్ సేవా సంఘానికి చెన్నై పోర్టు భారీ విరాళం అందించింది.అయికుడిలో వెన్నెముక చికిత్స హృద్రోగ చికిత్సా కేంద్రాల విస్తరణ కోసం రూ.1,04,77,800 విరాళంగా ప్రకటించింది. ఈ మేరకు చెన్నైలోని కామరాజర్ పోర్టు ఛైర్మన్ సునీల్ పలివాల్ గురువారం అమర్ సేవా సంఘం కో ఛైర్మన్ శంకర రామన్‌కు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నై పోర్ట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.మురళీకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టు అధికారులు మాట్లాడుతూ.. సమాజ సేవలో భాగంగా ఈ మొత్తాన్ని అందించినట్లు వివరించారు.

ఆలయాల్లో ఆడి అమావాస్య సందడి




ఆడి అమావాస్య సందర్భంగా తిరువళ్లూరు వీరరాఘపెరుమాళ్ ఆలయం వద్ద గుమికూడిన భక్తులు - తిరువయ్యారు కావేరి తీరం పుష్పమండపం వద్ద పితృదేవతలకు తర్పణాలు సమర్పిస్తున్న ప్రజలు

● భక్తులతో కిక్కిరిసిన పుణ్యతీర్థాలు

రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం తమిళమాసమైన ఆడి (ఆషాఢ) అమావాస్య దినం సందర్భంగా రామేశ్వరం, తిరువయ్యారు, సమయపురం, పూంపుహార్ సంగమం ఘాట్ తదితర పుణ్యక్షేత్రాల్లోని పుణ్యతీర్థాల్లో ప్రజలు స్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలారు. రామనాధపురం జిల్లా రామేశ్వరంలోలో భక్తులు పితృదేవతలకు తర్పణాలు విడిచారు. దీని కోసం బుధవారం సాయంత్రమే రామేశ్వరం ప్రాంతానికి చేరుకున్న భక్తులు వేకువజామునే సముద్రతీరంలో స్నానమాచరించి అగ్నితీర్థం ఒడ్డున పితృదేవతలకు పూజలు నిర్వహించారు. భక్తులు అగ్నితీర్థం ఓడ్డున పితృదేవతలకు తర్పణాలు విడుస్తుండగా మరో వైపు సముద్రం సుమారు 50 అడుగుల మేర వెనక్కి మళ్ళింది. దీనితో ఒడ్డున ఉన్న రాళ్లు, పచ్చటి నాచు బయటపడ్డాయి. ఇదేవిధంగా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, సముద్రతీరాల్లో ప్రజలు పెద్దలకు తర్పణాలు వదిలారు.


రామేశ్వరం అగ్నితీర్థం వద్ద వెనక్కిమళ్ళిన సముద్రం


పూంపుహార్ వద్ద కావేరి నదీజలాలు కడలిలో కలిసే సంగమం ఘాట్ వద్ద పితృదేవతలకు తర్పణాలు సమర్పించేందుకు వచ్చిన జనం

తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం



ప్యారీస్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ఆడి అమావాస్య గురువారం రోజున సముద్రం హఠాత్తుగా వెనక్కి వెళ్లడంతో మత్స్యకారులు, భక్తులు ఆందోళనకు గురయ్యారు. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, అయ్యా వైకుంఠర్ ఆలయం మధ్య సముద్రంలో ప్రతి నెలా అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రం వెనక్కి వెళ్లడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గురువారం కూడా సముద్రతీరంలో భక్తులు పితృదేవతలు తర్పణాలు వదిలేందుకు పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఆ సమయంలో సముద్రం సుమారు వందడుగుల వెనక్కి వెళ్లడంతో బండ రాళ్లు బయటపడ్డాయి. దీంతో పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది ప్రజలు సముద్రంలో స్నానాలకు దిగకుండా హెచ్చరికలు జారీచేశారు.

మురుగన్ సేవలో నటుడు యోగిబాబు

తిరుత్తణి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్యనటుడు యోగిబాబు బుధవారం రాత్రి తిరుత్తణి మురుగన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా కొనుగోలు చేసిన లగ్జరీ కారుకు యోగిబాబు పూజలు చేయించారు. యోగిబాబుకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు యోగిబాబుతో సెల్ఫీలు తీసుకున్నారు.


యోగిబాబుకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు



ఆగమోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆగమోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని చెంగల్వరాయ సన్నిధి వద్ద స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు వసంతోత్సవం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయంలోని వసంత మండపం వద్ద ఈ వేడుకను నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లు కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. శుక్రవారం రాత్రి పల్లకీసేవ జరగనుంది.

ధ్వజావరోహణం పూజలు చేస్తున్న వేదపండితులు

బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న మహారథం

తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. శ్రీవారి మహారథం(చెక్కతేరు)ను సిద్ధం చేసే పనులు సాగుతున్నాయి. మరోవైపు ఆలయ మహద్వారం గేట్లను వివిధ రసాయనాలతో శుద్ధి చేస్తున్నారు. ఇక పుష్కరిణి మరమ్మతు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



చెక్క తేరును సిద్ధం చేస్తున్న సిబ్బంది


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని రెండు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.55 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,130

తలనీలాలు సమర్పించినవారు: 26,786



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

పట్టాలెక్కుతున్న మాస్టర్ ప్లాన్

ఏడాదిలో ఏం చేశారు?

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ఆధ్యాత్మిక క్షేత్రమే కాదు, రాజకీయంగానూ ప్రాధాన్యంగల నియోజకవర్గం శ్రీకాళహస్తి. తాతలు వేసిన బాట.. తండ్రి చూపిన తోవ.. తల్లి చేదోడుతో రాజకీయాల్లో అడుగులు వేస్తున్నారు బొజ్జల సుధీర్‌రెడ్డి. శ్రీకాళహస్తి అభివృద్ధికి అనేక పనులను భుజాలకెత్తుకున్నారు. స్థానికంగానే నివాసముంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అధికారుల సమక్షంలో ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశిస్తున్నారు. మండలాల వారీగా టోల్‌ఫ్రీ తరహాలో ఫోన్ నంబర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేగా దూకుడు ఎక్కువ అనే ముద్రను తొలి ఏడాదిలోనే తుడుపుకోగలిగారు. తొలి ఏడాది శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఆయన చేసినవీ, చేస్తున్నవీ, చేయాలనుకుంటున్నవీ.. ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు..





ఈట్ స్ట్రీట్ తరహాలో జరుగుతున్న స్వర్ణముఖి నది కరకట్ట పనులు

రూ. 35 కోట్లతో చేసిన పనులు

- తాగునీటి సమస్య వున్న గ్రామాల్లో 70 బోర్లు తవ్వించారు.



ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిమ్

- శాప్ నిధులతో ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ. అందులో జిమ్, షటిల్ కోర్టు ఏర్పాటు.



శ్రీకాళహస్తి ఈద్గాలో పనులు

- శ్రీకాళహస్తిలో ఈద్గా పునరుద్ధరణ. పెద్ద ఈద్గాలో ల్యాంకో సీఎస్ఆర్ నిధులతో మినార్ నిర్మాణం.
- ఉపాధి హామీ కింద రూ. 12.64 కోట్లతో పనులు
- ఆర్ అండ్ బీ ద్వారా రూ. 1.71 కోట్లతో పనులు
- ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 3.82 కోట్లతో పనులు
- శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో రూ. 3.37 కోట్లతో పనులు.
- ఎంపీపీ 15వ ఆర్థిక సంఘం పీఎఫ్ఎంఎస్, సీఎఫ్ఎంఎస్ నిధులతో 10.82 కోట్లతో వివిధ పనులు.

ఇచ్చిన హామీలు

- నియోజకవర్గంలో 40 నుంచి 50 వేల మందికి పక్కా ఇళ్ళు
- తండ్రి ప్రారంభించిన ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్ పూర్తి చేయడం
- గుడిమల్లం, తొండమనాడు, శ్రీకాళహస్తి ఆలయాలు కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్.
- ముక్కంటి ఆలయంలో స్థానికులకు ఉచితంగా ప్రత్యేక దర్శనం
- స్కిట్ కళాశాల పునఃప్రారంభం
- స్వర్ణముఖి ప్రక్షాళన
- మెడికల్ కళాశాల ఏర్పాటు
- స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు
- మండలానికో ఎంఎస్ఎంఈ పార్కు... మహిళలకు ఉపాధి
- ఎస్ఎస్ కెనాల్, బాలాజీ రిజర్వాయర్ పూర్తి
- కన్నలి కాలువ, చెంబేడు కాలువల ప్రక్షాళన. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ.
- ఆటోనగర్ ఏర్పాటు.

చేసిన పనులు

- ఆలయంలో దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాం. ఇరవై ఏళ్ళగా ఆలయంలో పాతుకుపోయిన వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించా. మునుపు రోజువారీ రూ. 75 లక్షలు దాటని ఆలయ ఆదాయం ఇపుడు రూ. కోటి దాటుతోంది. ఆలయ పైకప్పునకు వాటర్ ప్రూఫ్ చేశాం. ఇదివరకూ పది వేల మందికి పెట్టే అన్న వితరణను 20 వేల మందికి పెంచాం.
- రూ. 55 లక్షల వ్యయంతో కన్నలి కాలువ పూడిక తీయించా.
- రేణిగుంట మండలం గాజులమండ్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రెండు నెలల కిందట సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇటీవలే మెగా జాబ్ మేళా నిర్వహించాం. 1788 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 712 మందికి అక్కడికక్కడే నియామకపుటుత్తర్వులు అందజేశారు.
- శ్రీకాళహస్తి, రేణిగుంటల్లో విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచీ కాపాడాం. శ్రీకాళహస్తి రాజీవ్ నగర్‌లో ప్రధాన రోడ్డు పక్కన 106 నిర్మాణాలు, లోపలి వైపు 82 నిర్మాణాలు అక్రమమని తేల్చి కూల్చివేయించాం. రేణిగుంటలో 90 అక్రమ నిర్మాణాలు కూలగొట్టించాం. మొత్తం 278 అక్రమ నిర్మాణాలు తొలగించాం.



రాజీవ్‌నగర్‌లో కూల్చిన అక్రమ నిర్మాణాలు

- శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని రూ. 35 లక్షల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేశాం. పీడియాట్రిక్ ఐసీయూ నిర్మాణంలో వుంది. మెటర్నటీ వార్డులో మెకానికల్ బెడ్లు ఏర్పాటు చేశాం. డయాలసిస్ యూనిట్ ప్రక్షాళన చేస్తున్నాం. ఆస్పత్రి అభివృద్ధికి అపోలో సంస్థతో చర్చిస్తున్నాం.



ఎమ్మెల్యే సొంత నిధులతో అభివృద్ధి చేసిన శ్రీకాళహస్తిలోని రెండో నెంబరు బాలిక వసతిగృహం

- ప్రభుత్వం ఇచ్చిన రూ. 40 లక్షలకుతోడు రూ.90 లక్షలు సొంత నిధులు వెచ్చించి శ్రీకాళహస్తిలోని నాలుగు హాస్టళ్ళలో మౌళిక సదుపాయాలను మెరుగుపరిచాం.
- రేణిగుంట నుంచీ షిర్డీ, వారణాసిలకు అలాగే కువైట్, చైనా, దుబాయ్‌లకు విమాన సర్వీసులు నడపాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరాను. ఏడాదిలోపు ఇవి జరిగే అవకాశముంది.
- గెలిచిన వెంటనే ఢిల్లీకి వెళ్ళి రైల్వే మంత్రిని కలసి శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కోరా. మంజూరయ్యాయి. పనులు కూడా మొదలయ్యాయి.

పక్కా ఇళ్ళకు స్పెషల్ డ్రైవ్: యువగళం పాదయాత్రలో పక్కా ఇళ్ళకు, ఇళ్ళ స్థలాలకు 59 వేల అర్జీలు వచ్చాయి. అర్హులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. ఇప్పటి వరకూ 15 వేల మందిని గుర్తించాం. డీకేటీ భూములు సేకరించి అందరికీ స్థలాలిస్తాం.

పారిశ్రామిక వరం: మన్నవరంలోని ఎన్టీపీసీ-భెల్ పరిశ్రమకు 50 ఎకరాలు మాత్రమే వుంచి మిగిలిన 700 ఎకరాలు వెనక్కు తీసుకున్నాం. ఇక్కడ హెలికాప్టర్ విడి భాగాల తయారీ పరిశ్రమ వచ్చే అవకాశముంది. రిలయన్స్, కార్డ్ బోర్డ్, ఫినోలెక్స్ వంటి మరో ఎనిమిది పరిశ్రమలను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. గడ్డి పెంచడానికి, వెదురు ప్లాంటేషన్ కోసం గ్రీన్ కంపెనీ ఏర్పాటుకు యత్నిస్తున్నాం. దీనికి 30 వేల ఎకరాలు కావాలి.

మలి ఏడాది లక్ష్యాలు!

- ఏర్పేడులో శాశ్వత ప్రాతిపదికన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. దానికోసం 48 ఎకరాలు గుర్తించాం. ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభమవుతాయి.
- తొట్టంబేడు మండల పరిధిలో రెండు మూడు నెలల్లోనే ఆటోనగర్ ఏర్పాటవుతుంది.
- నియోజకవర్గంలో వరి, వేరుశెనగ పంటల సాగు ఎక్కువ. ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ కింద గోదాముల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నా. మండలానికి ఐదు గోదాములు చొప్పున నిర్మించాలని ఆలోచన.

ఇవి చేయాలి.. చేస్తా!

- బాలాజీ రిజర్వాయర్‌కు సమయం పడుతుంది. దీనికి భారీగా నిధులు అవసరం. సీఎం చంద్రబాబు స్వయంగా రిజర్వాయర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.
- చెంబేడు కాలువ 24 కిలోమీటర్ల వరకూ ఆక్రమణలకు గురైంది. పూడిపోయింది. దీన్ని పునరుద్ధరించడానికి సాయం చేయాలని సీఎంను కోరా.
- సీఎం కరుణిస్తేనే మెడికల్ కాలేజీ కూడా వస్తుంది.

సోమశిల-స్వర్ణముఖి కెనాల్‌పై అసెంబ్లీలో: పెండింగ్ పనులు పూర్తి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించా. కేవలం నాలుగైదు ఎకరాల అటవీ భూములకు కేంద్ర అటవీ శాఖ అనుమతి రావాలి. చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరా.

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు



? ఎమ్మెల్యే గారూ.. శ్రీకాళహస్తి ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. అమలు చేయండి.

- పత్రి మురళి, చిల్లర దుకాణం యజమాని, శ్రీకాళహస్తి

! మా తండ్రి గోపాలకృష్ణారెడ్డి రూపొందించిన మాస్టర్ ప్లాన్ గత ప్రభుత్వం నిర్వాకంతో పెండింగు పడింది. ఒక డమ్మీ ఆర్కిటెక్‌ను పెట్టి రూ. 70 లక్షలు దుర్వినియోగం చేశారు. ప్రభుత్వ ఆర్కిటెక్ట్ ద్వారా ప్లాన్ అమలుకు చర్యలు మొదలుపెట్టాం. ఆలయానికి అనుకునివున్న 128 ఎకరాల దేవస్థానం భూములున్నాయి. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ భక్తుల సముదాయాలు నిర్మించేందుకు అంగీకరించాయి. ఇక తిరుపతి ఐఐటీ సహకారంతో ముక్కంటి ఆలయంలో పాలన, నిర్వహణ మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చేలా ఒక వ్యవస్థను అమల్లోకి తెస్తాం. మాస్టర్ ప్లాన్ అమలుకు రూ. 280 కోట్లు అవసరమవుతుంది. అన్నింటినీ ఆరునెలల్లో కొలిక్కి తెచ్చి పనులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



? స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేస్తామని, నది కరకట్టను అభివృద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారని గుర్తు చేస్తున్నాను ఎమ్మెల్యేగారూ.

- వెలంపాటి కృష్ణ, వంట మాస్టర్, కాసరం గ్రామం

! ఆలయంతో ముడిపడివున్న స్వర్ణముఖి పవిత్రతను కాపాడుతునే యూరోపియన్ తరహాలో అభివృద్ధి పరుస్తాం. నది కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. ఈట్ స్ట్రీట్ తరహాలో అభివృద్ధి చేస్తాం. నెల రోజుల్లోనే వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రాబోతోంది.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



? శ్రీకాళహస్తిలో ప్రతిష్ఠాత్మకమైన స్కిట్ కళాశాల మూత పడింది. గెలిస్తే తిరిగి తెరిపిస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది.

- డాక్టర్ వెంకటరామన్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, శ్రీకాళహస్తి

! ఏ హామీ కూడా వదిలేయను. స్కిట్‌ను తెరిపిస్తున్నాం. రూ.5 కోట్లతో అవసరమైన పనులు చేపట్టాం. ఆలయ నిర్వహణలోనే వుంచి లీజుపై కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నాం. రెండు నెలల్లో మంత్రి నారా లోకేశ్ ద్వారా అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించి తరగతులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు







డీవీజీ శంకర్రావు - శంకర్ జీవాల్ - రఘు

తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకర్రావు, తమిళనాడు డీజీపీ శంకర్ జీవాల్, సినీనటుడు రఘు ఉన్నారు.

శ్రీసిటీలో నైట్రోజన్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు

- నోవా ఎయిర్‌తో ఒప్పందం

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటులో భాగంగా నోవా ఎయిర్ టెక్నాలజీస్‌తో యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు నోవా ఎయిర్ సంస్థ సొంతంగా పైప్‌లైన్ వ్యవస్థ, ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ చేపట్టనుంది. శ్రీసిటీలో పారిశ్రామిక అవసరాలకు అంతరాయం లేకుండా దశలవారీగా ఈ ప్రాజెక్టు అమలుకానుంది. శ్రీసిటీని పారిశ్రామిక మౌళిక సదుపాయాలకు ఉత్తమ నమూనాగా మార్చే ప్రయాణంలో నోవా ఎయిర్‌తో భాగస్వామ్యం మరో ముందడుగుగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి ఆవిష్కరణ, సుస్థిరత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించాలన్న తమ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. ఈ ఒప్పందం పట్ల నోవా ఎయిర్ టెక్నాలజీస్ ఎండీ అండ్ సీఈవో గజానన్ నబార్ సంతోషం వ్యకం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలలోని సెజ్‌లకు పరిమితమైన యుటిలిటీ పైప్‌లైన్ నెట్‌వర్క్ సదుపాయం భారతదేశంలో ఈ తరహా చొరవ ఇదే ప్రథమం కావచ్చని వ్యాఖ్యానించారు.

28, 29 తేదీల్లో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి అర్బన్, జూలై 24: తిరుపతి రూరల్ తుమ్మలగుంట మైదానంలో 28, 29 తేదీల్లో బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఓ ప్రకటనలో తెలిపారు. '28న అండర్ 14, 16 బాలబాలికలకు, 29న అండర్ 8, 20 బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయి. వీటిలో ఎంపికైన వారు వచ్చేనెల 9నుంచి 11వరకు జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. ఆసక్తిగల క్రీడాకారులు ధ్రువీకరణ పత్రం, ఆధార్ తీసుకురావాలి. మరిన్ని వివరాలకు 86868 67079 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో కోరారు.

టీటీడీలో అంటరానితనం బాగా కనిపిస్తోంది

- అన్యమతం పేరుతో దళితులను ఇబ్బంది పెడుతున్నారు
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

చిత్తూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో అంటరానితనం బాగా కనిపిస్తోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. చిత్తూరులోని గాంధీ విగ్రహం ఎదుట గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో టీటీడీలో ఉన్నతాధికారులుగా దళితులు పనిచేశారన్నారు. ఇప్పుడు కనీసం ఒక్కరు కూడా కనిపించడం లేదని విమర్శించారు. కొండపైన వందలాది అంగళ్లలో ఒక్క ఎస్సీ, ఓబీసీ లేకపోవడం గమనార్హమన్నారు.ఇటీవల టీటీడీలో అన్యమతం పేరుతో దళితులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను మూసివేసి, మధ్యాహ్న భోజనం నిలిపివేసి పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు.బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో రూ.14.5 లక్షల కోట్ల దాకా బ్యాంకు రుణాలను మాఫీ చేసిందని, అయితే లబ్ధిదారు లందరూ కోటీశ్వరులేనని తెలిపారు. మాఫీ అయిన రుణాల్లో సుమారు రూ.లక్ష కోట్లు బీజేపీ వసూలు చేసుకుందని ఆరోపించారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు చిత్తూరు జిల్లా వాసి అయినా చిత్తూరును అభివృద్ధి చేయలేదన్నారు.



చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న చింతా మోహన్ తదితరులు

- సమీక్షలు- సమావేశాలు

వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టండి

తిరుపతి(కలెక్టరేట్), జులై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. సాధ్యమైనంత త్వరగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ, గిరిజన జిల్లా సంక్షేమాధికారులు భరత్‌కుమార్‌రెడ్డి, రాజా సోము, మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్తలు రేష్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

2029 నాటికి వందశాతం అక్షరాస్యత

జిల్లాలో 'ఉల్లాస్- అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తూ 2029 నాటికి వంద శాతం అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12,085 మంది వయోజనులను లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా ఈ ఏడాది 88,687మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకుని బోధన తరగతులు నిర్వహించాలన్నారు. 15-59 ఏళ్ల వారికి చదవడం, రాయడం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనికోసం ఆగస్టు 7న అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించాలని వయోజనవిద్యాశాఖ అధికారి మహమ్మద్ అజాద్‌ను ఆదేశించారు. వయోజనశాఖ నోడల్ అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, మెప్మా పీడీ రవీంద్ర, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఈవో కేవీఎన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంత బాయి తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర సెంట్రల్ వర్సిటీ పాఠ్యాంశంగా

'పల్లిపట్టు' రచన యాలైపూడ్సింది

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవి పల్లిపట్టు నాగరాజు రచించిన 'యాలైపూడ్సింది' కవితా సంపుటికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎంఏ తెలుగు ఆధునిక కవిత్వ విభాగంలో తెలుగు విద్యార్థులకు రెండవ సెమిస్టర్‌లో 'యాలైపూడ్సింది' కవితా సంపుటిని పాఠ్యాంశంగా చేర్చారు. సత్యవేడు మండలం రంగనాథపురం గ్రామానికి చెందిన పల్లిపట్టు నాగరాజు రాసిన కవితల సంపుటి 'యాలైపూడ్సింది'కి 2022లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. సమకాలీన వాస్తవికతను ప్రతిబింబిస్తూ, రాయలసీమ గ్రామీణ మాండలికంలో రాసిన 52 కవితల సంపుటి నాగరాజు తొలి రచన కావడం విశేషం. దళిత, బహుజన, గిరిజన కుటుంబాల జీవనశైలిలోని సౌందర్యాన్ని, శ్రామిక తత్వాన్ని, అట్టడుగు బతుకుల అగచాట్లను ఈయన కవితలుగా రాశారు. ఈ పుస్తకం ఉమ్మడిశెట్టి సాహిత్య అవార్డు వంటి ఎనిమిది అవార్డులను పొందింది. పల్లిపట్టు నాగరాజు ప్రస్తుతం వరదయ్యపాళెం జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.



పల్లిపట్టు నాగరాజు



రాయలసీమకు దక్కిన గౌరవం

యాలైపూడ్సింది కవితా సంపుటిని ఎంఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టడం చాలా సంతోషంగా, గౌరవంగా ఉందని పల్లిపట్టు నాగరాజు అన్నారు. ఇది అట్టడుగు కుటుంబాల, గ్రామీణ జీవితాలకు, వారి భాషకు ముఖ్యంగా రాయలసీమ మాండలికానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.